# 4వ కథ.

# దెయ్యంచెప్పిన కథ.

*

"దెయ్యాలు అనేవి తప్పక వుంటాయని నమ్మేవారు దీన్ని నమ్మవచ్చునంటాడు కథానాయకుడు"

*

వారంరోజులనుండీ ఎదురుచూస్తున్న వుత్తరం రానే వచ్చింది. పోస్టుమాన్ ఇచ్చిన వుత్తరాన్ని తీసుకొని గబగబా చదివాను. కావలసిన అన్నిసంగతులతోబాటూ మరో విషయంకూడా వుంది అందులో- "శ్రావణమాసం వెళ్ళగానే నీభార్యను తీసుకొస్తున్నాను"- అని వ్రాశారు మావగారు. ఈఅవాంతరం మరో నాలుగయిదు నెలలవరకైనా జరగదనే ధైర్యంతో- రోజు సుఖంగా నిద్రపోతున్న నాకు- మా మావగారు వ్రాసిన ఆవుత్తరం మతిలేకుండా చేసింది. నేనుంటున్న 'నగరం'లో ఇళ్ళు దొరకటం బ్రహ్మప్రళయమనే సంగతి ఆయనకు తెలియదుకాబోలు! నేను వుంటున్న- చిన్నబ్రహ్మచారికొంపలాంటి- ఇంటిప్రక్కన వుంటున్న ఒక కోమటాయన- ఎక్కడో ఇల్లుకడుతున్నాడనీ- అది ఆరు నెలల్లో పూర్తికావచ్చుననీ తెలుసుకొని అందులో ఒక వాటా రిజర్వుచేయించి- అప్పటినుండీ సంసారాన్ని పెట్టాలని- ఆవుత్తరం వచ్చే క్షణంవరకూ అనుకుంటున్నాను. కానీ ఆ అవాంతరం ఇంతదగ్గరలో వస్తుందని తలుస్తే ముందు జాగ్రత్తపడేవాడ్ని! ఆ ఉత్తరాన్ని మడచి జేబులో పెట్టుకొని (మరచిపోకుండా) వీధులన్నీ తిరగటం మొదలెట్టాను- ఎక్కడయినా ముచ్చటగా 'అద్దెకు' అనే మూడక్షరాలు కనిపిస్తాయేమోనని! అవిమాత్రం తేలికగా దొరుకుతున్నాయా? నిరుద్యోగసమస్య ప్రబలంగా వున్న ఈరోజుల్లో- ఆ ఉద్యో

గాలయినా దొరుకుతున్నాయిగానీ- అద్దెకు ఇళ్ళుమాత్రం దొరకటంలేదు. మాకు- అన్నివిధాలా అనుకూలంగావున్న ఇల్లు ఎక్కడా కనబడలేదు. ఒహవేళ కనిపించినా- దానికి కిటికీలులేక, గాలిరాక, ఎప్పుడో ప్రతాపరుద్రుని కాలంలో కట్టిన కొంపల్లా వున్నాయి.- మొత్తానికి ఒక సందులో చిన్న మేడ ఒకటి అద్దెకీయ బడుతుందని తెలుసుకొని- ఇంటివారివద్దకు వెళ్ళి అడిగాను. ఆ ఇంటిగలాయన-. ముందు నన్ను ఎగాదిగా చూసి- చివరకు ఎలాగయితేనేమి ముప్ఫైరూపాయలకు ఇస్తానన్నాడు. అన్నిహంగులూ వుండీ- ఆర్భాటంగా వున్న ఆమేడకు ఏ ఏభయ్యో- అరవయ్యో అద్దె అడుగుతాడనుకొన్న పెద్దమనిషి- ముప్పయిరూపాయలు అడగటంతో- మూడు నిముషాలు అనవసరంగా ఆశ్చర్యపడి- బహుశా మతి చలించినమనిషేమో అని సర్దుకొని- అద్దె అడ్వాన్సుగా ఇచ్చి- ఆమేడకు తాళం తగిలించి- ఒకమారు కాలరు సర్దుకున్నాను 'వెస్టిండీస్ జట్టు'లో విజయం పొందిన క్రికెట్టుప్లేయర్ లా। నారూమ్‌కు తిరిగిరాగానే- "ఇల్లు రిజర్వుచేసినట్లూ శ్రావణమాసం వెళ్ళగానే మీఅమ్మాయిని తీసుకొచ్చి దిగబెడితే కాపురంపెట్టటానికి సంసిద్ధుడననీ" మావగారికో వుత్తరం ముక్క వ్రాసి పడేశాను.

ఆరోజున ఆఫీసుకు అరగంట ఆలస్యంగా వెళ్ళినందుకు చురచురా చూశాడు మానేజరు.

"ఏమోయ్! ఆలస్యంగా రావటంకూడా నేర్చుకుంటున్నావే!"- అన్నాడు- పొద్దున్న ఎనిమిదిగంటలకే వచ్చే అలవాటున్న- నా ఎదుటిసీటులోని ఈర్ష్యాళువు.

నీపనే బాగుందోయ్! పొద్దున్న అరగంట ఆలస్యంగా రావటం- సాయంత్రంకూడా ఆలస్యమెందుకని- ఒక అరగంట ముందు వెళ్ళిపోవటం- అయినా దేనికయినా పెట్టి పుట్టాలనుకో"- అంది మరోసీటులోని జుగుప్సావంతుని కంఠం.

"మరేనోయ్! ఇళ్ల వేటకు బయల్దేరి- చివరకు ఒక దాన్ని 'సెలక్ట్' చేసుకొని వచ్చేసరికి ఆలస్యమైంది"- అంటూ నా సీటులో కూర్చుని- ఆరోజు వచ్చిన కాగితాల్ని 'పెండింగు బాక్సు'లో పడేసి- అంతకు మూడురోజులనుండీ విముక్తి కోసం నిరీక్షిస్తున్న 'పెండింగ్' కాగితాలను తీసుకున్నాను.

"ఇంతకీ ఇల్లు ఎక్కడచూశావ్- డాబానా? పెంకుటిల్లా? ముందు 'ఓపెన్ స్పేసూ'- వెనక 'బేక్ యార్డూ' ఉన్నాయా?" అన్నాడు ఈర్ష్యాళువు మళ్ళీ.

"ఆహా! అన్నీ వున్నాయి. అద్దె స్వల్పంలో- బ్రహ్మాండమయిన మేడ దొరికింది" అంటూ నాఅదృష్టాన్ని అరగంట

పొగడుకొని- ఇంటివివరాలూ- దాని 'లొకేషనూ' వగైరాలన్నీ విడమర్చి చెప్పాను. అందరూ ఒకేసారి ముక్కుమీద వేళ్లేసుకొని- ఆశ్చర్యచకితులయిపోయి, నోళ్ళు బలవంతంగా తెరచుకొని- 'హారా' అని ఒకడూ- 'హాతోస్మి' అని వేరొకడూ, తమఆశ్చర్యాలను బయటకు వెళ్ళబుచ్చటం మొదలుపెట్టారు.

"ఏమిటోయ్! అంత ఆశ్చర్యపోతున్నారు?" అన్నాను నేను.

"నీకు ఆమేడసంగతి తెలుసునా"—

"అది గత మూడు నెలలుగా ఖాళీగా వుంటోందోయ్!"

"నీధైర్యాన్ని మెచ్చుకోవాలోయ్"!

'లాస్టువీక్'- ఎవరో ఒకాయన అందులో చేరి మూడోరాత్రి ఖాళీచేశాట్ట"-

"అందులో దెయ్యం తిరుగుతోందిటోయ్!

"ఇంతకీ నీకు మరణయోగం ఆసన్నమైందేమో?"

"కాదోయ్! మనకోరోజు శెలవు దొరుకుతుంది"

కుక్కలు మొరిగినట్లూ- కాకులు అరచినట్లూ- ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు- ఆమేడగురించి తమతమ అభిప్రాయాలను ఏకకంఠంతో వెలిబుచ్చారు.

ఆసాయంత్రం ఆఫీసునుండి బయటకు నడచినతరు

వాత- నాతోటిగుమాస్తా లందరూ- నావెంటబడి- నాధై ర్యాన్ని మెచ్చుకుంటూ- 'నాదగ్గర డబ్బులులేవు మొర్రో' అంటున్నా వినక- అరువిచ్చి- కాఫీ త్రాగారు-

“అది 'దెయ్యాలమేడ' అనే విషయం నీకు తెలియదా?” అని అడిగాడు ప్రభాకరం- కాఫీత్రాగటం పూర్తి అయి- బయటకు వస్తూంటే!

తెలిస్తేమాత్రం మనవాడికి భయమా?- అసలే సైకాలజీ చదివిన బుర్రాయె! సమర్థించాడు శ్రీనివాసులు.

నిజమేనోయ్ వాసూ- దయ్యాలు అనేవి వుంటాయని నాకు నమ్మకంలేదు. ఇటువంటివన్నీ కేవలం మనుషుల నమ్మకాలమీద ఆధారపడి వుంటాయని నానమ్మకం.”- అన్నాను నేను.

ఆతరువాత మాసంభాషణ అంతా దెయ్యాలమీదా, వాటి వింతప్రవర్తనలమీదా జరిగింది. వాళ్ల సంభాషణలో నేను పాల్గొనకపోయినా శ్రద్ధగా వినటంమాత్రం తప్పలేదు.

“నీతరువాత- ఆమేడలోకి- అద్దెకువచ్చేవారందరకూ నువ్ మార్గదర్శకుడివి కావాలి”- అంటూ అభినందించాడు అవధాని- ఆఖర్న నేనింటిముఖం పట్టినప్పుడు!

* * *

ఆతరువాత రెండురోజులకు- ఏకాదశీ బుధవారం- ఒకపూట ఆఫీసుకు శలవుపెట్టి- అంతవరకూ నేను వుంటున్న 'రూమ్' లోని సామానంతా దెయ్యాలమేడ అని పలువురిచేత పిలువబడుతున్న- ఇంటికి తరలించాను. ముందు విశాలంగా ఒక పెద్దగది- దానికి ఎడమచేతివైపు ఒక గది- అందులోకి ఎక్కువ వెలుతురువచ్చే అవకాశం వుండదు. కానీ గాలికి లోటుండదు. ఈరెండుగదులు కాకుండా వంటకు ఒక ప్రత్యేక మయిన గది- విశాలమైన దొడ్డి... ఆదొడ్లో స్థిరనివాసం ఏర్పరచుకొన్నాయి ఎన్నో పక్షులు- అక్కడున్న రెండుచింత చెట్లమీద. అవన్నీ అలావుండగా మేడమీద మరో గది కూడా వుంది. దాని అవసరం నాకు కనిపించలేదు.

ఆసాయంత్రం లైబ్రరీకి వెళ్ళి- ప్రఖ్యాత ఆంగ్లరచయిత వ్రాసిన 'మాన్ అండ్ ది డెవిల్'- అనే నవల తెచ్చుకున్నాను- చదవటానికి! చిన్నప్పుడు మాతాతయ్యవద్ద దెయ్యాలగురించి కథలు వినటమేగానీ- వాటిని ప్రత్యక్షంగా చూడలేదు. కనీసం చూచినవాళ్ళు చెప్పగానైనా వినలేదు. అందుకే వాటినిగురించి తెలుసుకోవాలనే కోరిక నాలో ఎక్కువకావటంతో- ఆరాత్రి హోటల్‌లో భోజనం ముగించుకొని ఇంటికివచ్చి, లైబ్రరీనుండి తెచ్చిన నవల తెరచాను... ఒకమనిషి చనిపోయినతరువాత ఏవో పరిస్థితులలో దెయ్యం

కావచ్చునో- అందుకు అవకాశాలూ, వాటి స్వభావాలూ- అన్నీ క్షుణ్ణంగా అనుభవజ్ఞులనుండి సేకరించి వ్రాసిన నవల అది. దెయ్యం ఒకమనిషిపై ఎంతకక్షకట్టినా- దానిని పట్టుక పీడిస్తుందిగానీ- ఒక్కసారిగా చంపలేదు. కొన్ని కొన్ని దెయ్యాలు ఆవిధంగా మనుష్యుల్ని చంపిన వివరాలూ- ప్రదేశాలూ- వాటి వింతప్రవర్తనలూ చాలా విశదంగా వ్రాయబడి వున్నాయి ఆనవలలో- దయ్యానికి ఇదమిత్థమయిన రూపం వుండదనీ- అనేకరూపాలలో అనేకపనులు చేయగలదనీ కూడా వ్రాయబడి వుంది.

...... ఇంగ్లండులోని ఒక చిన్నగ్రామంలో ఒక యువకుడు వుండేవాడు. మనిషి సామాన్యకుటుంబంలోనే జన్మించాడు.

స్కాలర్‌షిప్పులు సంపాదించి ఉన్నతవిద్య నభ్యసించాడు. తాను యూనివర్సిటీలో చదువుతూండగా- ఒక అమ్మాయితో పరిచయం అయింది. వివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ ఆమెను బలవంతాన- వేరొక వ్యక్తి వివాహం చేసుకున్నాడు. దానితో విరక్తి చెందిన అతను- ఆమెనూ- ఆమెభర్తనూ చంపి- తానుకూడా తనగదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆసంఘటన జరిగినప్పటినుంచీ- ఆడాబాలోనికి వేరే మనుష్యు లెవ్వరూ రాలేదు. కానీ

అతడు మాత్రం దెయ్యంరూపంలో అందులో సంచరిస్తూ- రాత్రిళ్ళు వీధిలో తిరుగుతూ- ఒంటిగాపోయే ఆడవాళ్ళను బలవంతాన లాక్కొచ్చి, ఆగదిలో- హింసించే వాడట. దానితో ప్రజలలో పెద్ద అలజడి చెలరేగింది. ఒకరోజు ఆయింటికి నిప్పు పెట్టారు. ఆతరువాత ఆయువకుని గురించి మళ్ళీ తెలియరాలేదని- వ్రాశాడు ఆరచయిత- తననవలలో- నాకు భయమూ బాధాకలిగాయి. కేవలం ఒక ఆడదాని కోసం అంత రగడజరగడం ఆశ్చర్యం కలిగించింది. ఆలోచనలతో ఆరాత్రి నాకు నిద్రపట్టనేలేదు. ఏమాత్రం శబ్దమయినా- జాగ్రత్తగా చూసేవాడ్ని! అదేవిధంగా రెండురోజులు గడచిపోయాయి. నన్నూ నాగుండెధైర్యాన్ని చూసి హడలిపోయి- దయ్యం పారిపోయిందని- మూడోనాటి ఉదయం- ఆఫీసులోని- గుమాస్తా సహోదరులందరూ- ఏకగ్రీవంగా తీర్మానించారు. కావచ్చుననుకున్నాను నేను.

కానీ అలా కాలేదు...

ఆ మూడవనాటి రాత్రి మొదటి ఆట సినీమా చూసి వచ్చి పడుకున్నాను. దొడ్డిలోని చింత చెట్టు గాలికి రివ్వు మని శబ్దం చేస్తోంది. చల్లటిగాలి వంటింటి కిటికీలోంచి వచ్చి- మధ్యగదిలోని మంచంమీద వున్న నా ఒంటికి- ఇంకా చల్లగా తగులుతోంది. ఆగాలికి నిద్ర పడుతోంది నాకు. అంతలోనే

చిన్నగా ఏదో అలికిడి అయింది. చెవులు రిక్కించుకొని విన్నాను. మళ్ళీ అదే చప్పుడు- కాలిమువ్వలు కదలుతున్నట్లూ- చేతిగాజులు రాసుకుంటున్నట్లూ!—

వళ్ళు ఝల్లుమంది నాకు. అంతలోనే పరిస్థితి నర్థం చేసుకొని ధైర్యం తెచ్చుకున్నాను. కదలకుండా పడుకొని- శ్వాసను బిగపట్టి- తలవైపునవున్న కర్రను సవ్వడి చేయకుండా చేతిలోకి తీసుకున్నాను.

రెండునిముషాలు నిశ్శబ్దం. గోడమీద నున్న గడియారం చప్పుడు నాగుండెల్లో ప్రతిధ్వనిస్తోంది.

దొడ్లో గాలి- ఒకటే హోరు. చింతచెట్టుమీది పక్షులు గాలికి రెక్కల్ని టపటపా కొట్టుకుంటున్నాయి. మళ్ళీ గాజుల చప్పుడు. ఎవరో తరుముకొస్తూంటే- పారిపోతున్న ఆడదాని చేతుల కున్న గాజుల సవ్వడిలా వుంది. మధ్యమధ్య సన్నటి ఏడుపును చీల్చుకుని వచ్చే ఎక్కిళ్లు- మళ్ళీ నిశ్శబ్దం. ఖచ్చితంగా అది దయ్యమే నని నిర్ధారణ చేసుకున్నాను. గడియారం అర్ధగంట కొట్టింది. ఉలిక్కిపడ్డాను ఆశబ్దానికి. అయినా ధైర్యాన్ని కూడదీసుకుని రెప్ప వాల్చకుండా- చెవులురిక్కించుకుని బెడ్ లైటు ఇస్తున్న చిన్నకాంతిలో చుట్టూ చూస్తున్నాను. గడియారం తిరిగిపోతోంది. చింతచెట్టు గాలికి తట్టుకోలేక ఊగిపోతోంది. శరీరాలకు చలిగాలి తగిలినప్పు డల్లా-

రెక్కల్ని కొట్టుకుంటున్నాయి పక్షులు. ఇంక నిద్రకు ఆగలేక ఆదెయ్యం సంగతి తేల్చుకోవా లనుకున్నాను. కర్రను చేతి లోనే వుంచుకొని చప్పుడు కాకుండా లేచి నాలుగడుగుల దూరంలో వున్న 'స్విచ్' దగ్గరకు ఒక అడుగులో చేరుకొని- గభాల్న స్విచ్ ఆన్ చేశాను. అంతలోనే పెద్దగా- గాజుల చప్పుడు- మువ్వలసందడి- వినిపించాయి. లైటు కాంతికి ఆ దెయ్యం పారిపోయి వుంటుందనుకొన్నాను. వంటింటిలోకి వచ్చి చూశాను. గదంతా మామూలుగా వుంది. మళ్ళీ మధ్యగదిలోకి వచ్చి వంటింటి తలుపుకు లోపల గొళ్ళెం పెట్టుకొని పడుకున్నాను. మళ్ళీ చప్పుడు వినబడలేదు. కలత నిద్రతో గడిచిపోయింది రాత్రి. మర్నాటి వుదయం- మా ఆఫీసులో నేను చెప్పిన ఈవిషయం విని అందరూ విస్మయం పొందారు. నాప్రక్కసీటులో కూర్చునే సూర్యనారాయణ ఆరోజంతా- నాతో ఆవిషయంపైనే చర్చించాడు. సూర్య నారాయణకూడా కండబలం గుండెధైర్యం కల మనిషి. ఇటు వంటి విషయాలంటే ఎంతో శ్రద్ధ చూపిస్తాడు. దేవుడన్నా- దెయ్యమన్నా నమ్మకం తక్కువ మనిషి. అలా అని బొత్తిగా నాస్తికుడూ కాదు- ఏవిషయమైనా తనకళ్ళతో చూడందే నమ్మడు. ఆరాత్రి దెయ్యంసంగతేమిటో చూడటానికి సూర్యనారాయణకూడా తయారయ్యాడు. అన్ని సన్నా హాలూ చేసుకొని- ఆదెయ్యం అంతు తేల్చుకుందుకు సంసిద్ధు

లయిన మేము- ఆ రాత్రి ఏమీ చప్పుడు వినపడకపోవడంతో నిరుత్సాహ పడిపోయాం. నేను చెప్పిన అనుభవమంతా పట్టి భ్రమ అనీ- ఆయింటిలో దెయ్యమనేది లేదనీ- రూఢిగా నిశ్చయించారు అంతా.

వారం రోజులు గడిచిపోయాయి. దెయ్యాన్ని గురించి ఆలోచనలను బలవంతంగా తెచ్చుకునే నా మెదడు అవన్నీ మరచిపోయి, నిద్రకు కొంచెం అలవాటు పడుతోంది.

ఆరోజు రాత్రి రెండు గంటలయి వుంటుంది. బయట హోరున వాన కురుస్తోంది. ఏదో చప్పుడయితే మెలకువ వచ్చింది. డ్రాయరుమీద గ్లాసును తోసేసి- కిటికీలోంచి పారిపోయింది పిల్లి. మళ్ళీ నిద్ర పడుతోంది నాకు.

వంటగదిలో ఏదో శబ్దం. ఇదివరలో విన్నటువంటి శబ్దం! సన్నగా ఏడుపు. అందులో ఎక్కిళ్ళు. కర్రను తీసుకొని మెల్లగా అడుగులు వేస్తూ వంటగదిలోకి వెళ్ళాను. నా చేతిలోని "టార్చి" వెలుతురు ఆగదిలో పడింది. అక్కడ ఒక మూలనున్న బక్కెట్టు బోర్లాపడి- అందులో వున్న కొంచెం నీళ్ళు- వలికిపోయాయి. అక్కడనుండి మరోమూలకు గబ గబా అడుగులు పడ్డాయి. నాకు పూర్తిగా అర్థమయింది. నన్ను చూసిన ఖంగారులో దెయ్యం ఆమూలకు పరుగెత్తి వుంటుందనుకున్నాను. అడుగులు అక్కడితో ఆగిపోయాయి.

"కదలకు- నేను నిన్నేమీ చేయలేను. కానీ మర్యాదగా అడుగుతున్నాను చెప్పు! నువ్ ఎందుకిక్కడ వుంటున్నావ్? నువ్ అసలు ఎవరవు?-" ధైర్యాన్ని కూడదీసుకొని గట్టిగా అడిగాను.

బదులుగా సన్నని ఏడుపు వినబడింది నాకు.

"ఎందుకలా ఏడుస్తావ్? నీకేం కావాలి?" (దెయ్యాలకు కూడా కోరికలుంటాయని నవలలో చదివాను)

"అన్యాయానికి ఆహుతయిన ఒక ఆడదానిని నేను" ఆగది మూలనుంచి వినబడింది.

"సరీగా ఆరునెలల క్రితం- నేనూ- మావారూ- ఈ ఇంటిలోకి అద్దెకు వచ్చాం. ఈ ఇంటికి ఎదురుగా వున్న ఆ డాబాలో ఇద్దరు కాలేజీకుర్రాళ్ళు వుండేవారు. అందులో ఒకతను- చాలా హుషారుగా వుండేవాడు. ఎప్పుడూ అతని ముఖంలో నవ్వు నృత్యం చేస్తుండేది. అతని చిరునవ్వుకోసం- అతని దర్శనభాగ్యంకోసం నామనసెందుకో ఆరాటపడేది. మొత్తంమీద- ఆయింటికి వచ్చిన ఇరవైరోజులలోనే అతనితో పరిచయం చేసుకున్నాను. ఆపరిచయం బలీయమైంది. మావారినుండి పొందలేని ఆనందాన్ని అతనివలన పొందగలిగాను. నేనుచేసిన పాపం నాహృదయానికి తెలుసు. కానీ ఏంచేయగలను?- మావారికి- మొదట ఇద్దరుభార్యలు పోగా- నన్ను

మూడో భార్యగా వివాహం చేసుకున్నారు. వారితో వివాహం చేసి నాజీవితం నాశనం చెయ్యొద్దని మానాన్నను బ్రతిమాలు కున్నాను- కానీ మాపిన్ని ఒప్పుకోలేదు. అందుకే మా నాన్నకు తప్పులేదు. యవ్వనంలో వుండి- పురుషవాంఛకై- పరితప్తి నొందే నాకు- నడివయస్కులయిన మావారు- సంతృప్తి నివ్వలేకపోయారు. అందుకే- నేను ఆపాపాన్ని మూటగట్టుకున్నాను. తోటి హైందవ స్త్రీలందరకూ అవ మానం కలిగేపని చేశాను. కానీ నాపాపం అంత తొందర లోనే పండుతుం దనుకోలేదు. మా సరసాలు కళ్ళారా చూశారు మావారు. ఒకరాత్రి నిదరపోతున్న నన్ను లేపారు. వారిచేతిలో కత్తి మెరుస్తోంది. అంతే- అదేకత్తి- అదే క్షణంలో నాప్రాణాన్ని బలి తీసుకుంది...” ఆగిపోయింది ఆమెకంఠం. మళ్ళీ ఏడుపు ఆమెగాథ నాకెందుకో బాధ కలిగించింది.

‘మరి నువ్ ఇంకా ఇక్కడే వున్నా వెందుకని?’ అది అర్థంలేనిప్రశ్న అని నాకు తెలుసుండే ప్రశ్నించాను.

“అవును! ఇక్కడే వున్నాను. ఇక వెళ్ళిపోతాను. కానీ వెళ్ళిపోయేముందు నేనొకవిషయం తెలుసుకోవా లను కున్నాను. కానీ ఇంతవరకూ అవకాశం దొరకలేదు. మీరయినా చెప్పండి. ఇందులో నాతప్పేమయినా వుందా?”—

ఆమెప్రశ్నకు అదిరిపడ్డాను నేను. అలనాటి విక్రమార్కుని- శవంలోని భేతాళుడు ప్రశ్నించినట్లుగా తోచింది నాకు. ఏమని చెప్పాలి జవాబు...?

పతిని ప్రత్యక్షదైవమని నమ్మకుండా- కట్టుకున్న భర్తని అన్యాయం చేసి- కేవలం ఐహిక ఆనందంకోసం పరాయి మగవానితో సంబంధం పెంచుకున్నది ఆమె. కాబట్టి తప్పు ఆమెదే!

కానీ ఆమెభర్త అప్పటికి ఏభయ్యోపడిలో పడ్డ వ్యక్తి. అంతక్రితం అతనికి ఇద్దరు భార్యలు పోయారు. ధనమూ, హోదా వున్నాయని- యవ్వనంలో వున్న ఆమెను మూడవ భార్యగా చేసుకున్నాడు. ఆవయసులో తానామెను సుఖపెట్టలేడనే సంగతి తెలుసుకోకుండా తీయనికోరికలతో భవిష్యత్తుకు నిచ్చెనలు వేసుకునే ఒక ఆడదానికి అన్యాయం చేయటం- ఒకవిధంగా అతనిదీ తప్పు!

ఇద్దరూ తప్పులు చేశారు...

కానీ 'ఎప్పటి కెయ్యది ప్రస్తుత' మన్నట్లు ఆమెను సమర్థిస్తూ మాట్లాడితే- అప్పటికి మంచిదనే ఉద్దేశ్యంతో-

"ఇందులో నీతప్పేముంది? వయసులో వుండి సుఖపడా లనుకున్న నిన్ను- ఆసుఖాన్ని- ఆనందాన్ని ఇవ్వలేని సంగతి తెలుసుండికూడా నిన్ను మూడవభార్యగా చేసుకున్న నీభర్తదే తప్పు; నీతప్పు లేనేలేదు!" అన్నాను నేను.

“నాతప్పు లేదని నాకు పూర్తినమ్మకం వుంది. బరువెక్కిన నాహృదయం తేలికయింది. ఇన్నాళ్ళూ ఈవిషయం తెలుసుకుందుకే వున్నాను ఇక్కడ. నాకీనాటికి విముక్తి కలిగింది. కృతజ్ఞతలు; వస్తాను” మళ్లీ గాజులచప్పుడు. వంటింటి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకున్నాయి. బయట వర్షం తగ్గింది. ఎక్కడో కోడి కూసింది. నాకు చిన్నగా కునుకు పట్టింది.

ఈవిషయం నాస్నేహితులకు మర్నాడే చెప్పాను. కానీ ఎవరూ నమ్మలేదు. నమ్మించాలని నేను ప్రయత్నం చేయలేదు. మిమ్మల్ని నమ్మమనీకూడా నేను బలవంతం పెట్టను. కానీ మరోవిషయం-

ఈసంఘటన జరిగిన మూడుమాసాలకు దొడ్లో నుయ్యి త్రవ్వటంకోసం గొయ్యి తీయిస్తుంటే 8 అడుగుల లోతున ఒక అస్థిపంజరం మాత్రం వుంది. అది ఇంటాయన కూడా చూశాడు.